సమాచారం

రైతు భరోసా

రూ.127.88 కోట్లు విడుదల


రైతుల ఖాతాల్లో జమ

రంగారెడ్డి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సాగుకు రైతు భరోసా' కింద ఇచ్చే పెట్టుబడి సాయం సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అయింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. జిల్లాలో 1,87,437మంది రైతుల ఖాతాల్లో రూ.127.88 కోట్లు ట్రెజరీలో జమ అయ్యాయి. సోమవారం రాత్రి వరకు పలువురి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయినట్లు జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు.

నేటి నుంచి యోగా వారోత్సవాలు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని మంగళవారం నుంచి యోగా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ పతాంజలి యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను వివరిస్తామని, 18న ర్యాలీలు, 19న హోమం నిర్వహిస్తామని తెలిపారు. 20న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే యోగా కార్యక్రమానికి హాజరవుతామని పేర్కొన్నారు. 21న షాద్‌నగర్ పతాంజలి యోగా ప్రధాన కేంద్రంలో ఉదయం 5 గంటల నుంచి యోగా డే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని శశిధర్ అన్నారు.


పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెలాఖరుకు నోటిఫికేషన్ వస్తుందన్న మంత్రి పొంగులేటి ప్రకటనతో ప్రధాన రాజకీయ పార్టీలు, నేతలు అప్రమత్తమయ్యారు. తొలుత జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. అధికారులు కూడా ఎలక్షన్స్ నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు బ్యాలెట్ బాక్సులు కూడా సిద్ధం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎన్ని విడతలుగా నిర్వహిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



పల్లెల్లో సందడి!

మొదలైన స్థానిక ఎన్నికల హడావిడి

- మంత్రి పొంగులేటి ప్రకటనతో నేతలు సన్నద్ధం
- తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- బీసీ రిజర్వేషన్లపై ఇంకా సందిగ్ధత
- మేడ్చల్ జిల్లాలో మున్సిపల్ పోరే
- అధికార పార్టీకి సవాల్‌గా ఎన్నికలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

స్థానిక ఎన్నికలకు ఈ నెలాఖరులో నోటిఫికేషన్ రానున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటనతో పల్లెల్లో సందడి నెలకొంది. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి పర్యటనలో ఆయన స్థానిక ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. తొలివిడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని.. రెండో విడత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెలాఖరుకే నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. దీంతో పల్లెల్లో ఎలక్షన్ సందడి మొదలైంది. ఆయా రాజకీయ పార్టీలు, నేతలు స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆశావహులు పోటీకి సన్నద్ధమవుతున్నారు. తమ పార్టీ పెద్దలను కలిసి ఈ సారి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. నగర శివార్లలో ఎన్నికలకు భారీగా ఖర్చయ్యే అవకాశం ఉండడంతో అంగబలంతో పాటు ఆర్థికబలంగా ఉన్న నేతల

మిగతా 7వ పేజీలో...

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 42శాతం అమలు చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల కాంగ్రెస్ ముఖ్యనేతలు ప్రకటించారు. అయితే దీనిపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. బీసీలకు రిజర్వేషన్ల కోటాను 42శాతం చట్టబద్ధంగా పెంచేందుకు అనేక చిక్కుముడులు ఉండడంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ విషయంపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ 42శాతం సీట్లు బీసీలకు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే తరువాత రిజర్వేషన్లు పెంచాలని బీసీ వర్గాల నుంచి డిమాండ్ పెరగడంతో ఈ ప్రక్రియ పూర్తిచేసిన తరువాతనే స్థానిక ఎన్నికలు పెడతామని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు.

బీసీ రిజర్వేషన్లపై సందిగ్ధత

జిల్లాల్లో స్థానాల సంఖ్య

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీటీసీ	పంచాయతీలు
రంగారెడ్డి	21	232	531
వికారాబాద్	20	229	594


సమస్య వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 68 అర్జీలు

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 68 విజ్ఞప్తులు రాగా, అందులో 30 దరఖాస్తులు రెవెన్యూశాఖ, 38 ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

హామీలు నెరవేర్చండి : ఉద్యమకారులు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో 1200 మందికి పైగా బలిదానాలు చేసుకున్నారని, నేటికీ కొంతమంది అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యమకారులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ధారా సత్యం, కేవీ రంగారెడ్డి, నాయకులు సామ నిరంజన్, కొత్త రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రమేష్ పాల్గొన్నారు.


తిమ్మాయిపల్లిలో భూములను సర్వే చేస్తున్న అధికారులు

తిమ్మాయిపల్లిలో ప్రభుత్వ భూముల సర్వే

కందుకూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వం భూములను సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రెవెన్యూ, సర్వే అధికారులు సోమవారం సర్వే పనులు ప్రారంభించారు. సర్వే నంబర్ 9లో ఉన్న 354ఎకరాల భూములను గతంలో రైతులకు కేటాయించారు. వారికి పరిహారం చెల్లించి ఈ భూములను తిరిగి సేకరించాలని ప్రభుత్వ నిర్ణయించింది. మొదటి రోజు సుమారు 175 ఎకరాలను సర్వే చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వే అధికారులు క్రిష్ణయ్య, సాయికాంత్, శ్రీనివాస్, ఆర్‌ఐలు యాదగిరి పాల్గొన్నారు.

మృత్యు సాగరంగా పెద్ద చెరువు

మూడేళ్లలో 30 మంది మృత్యువాత

- చెరువులో భారీగా పెరిగిన కంప చెట్లు
- రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలం
- గాలికొదిలేసిన సుందరీకరణ పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఇబ్రహీంపట్నం చెరువు

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు మృత్యుసాగరంగా మారింది. చెరువు వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మూడేళ్లలో 30మంది చనిపోయారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా, మరికొందరు ప్రమాదవశాత్తు మృత్యువాత పడినవారున్నారు. చెరువులో కంపచెట్లు ఏపుగా పెరగడంతో మృతదేహాలను బయటకు తీయాలన్నా నానా అవస్థలు పడాల్సి వస్తుంది. చెరువును సుందరీకరించాలని ప్రతిపాదనలున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

45 ఏళ్ల తర్వాత నిండిన చెరువు

45 ఏళ్ల తర్వాత 2022 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారింది. ఈ చెరువుకు నీరొచ్చే పెద్ద కాలువను పునరుద్ధరించడంతోపాటు దీనిపై తిమ్మాపూర్, ఎలిమినేడు, పోచారంల వద్ద చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. దీంతో వర్షం నీరు సాఫీగా చెరువులోకి చేరుతుంది. చెరువు నిండటంతో పంటల సాగు పెరిగింది. చేపలు పట్టుకొని మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రెండేళ్ల 9 నెలల కాలంలో ఈ చెరువులో పడి 30 మందికి పైగా మృత్యువాతపడ్డారు. వీరిలో ఎక్కువ శాతం ఆత్మహత్యలకు పాల్పడగా.. కొందరు ప్రమాదవశాత్తూ చెరువులోపడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అయితే చెరువులో

మిగతా 8వ పేజీలో...

రక్షణ చర్యలు చేపట్టాలి



పెద్ద చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దడానికి వెంటనే పనులు ప్రారంభించాలి. ఇంత మంది చెరువులో మృత్యువాత పడుతుంటే అధికార యంత్రాంగం ప్రమాదాల నివారణకు సరైన చర్యలు తీసుకోవడం లేదు. కట్ట పొడవునా లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. చెరువులోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. చెరువులో ఎవరైనా దూకినా వెంటనే బయటకు తీసే పరిస్థితి లేదు.

- బూడిద కరుణశ్రీ, కప్పాడు మాజీ సర్పంచ్



కేంద్ర పథకాలతో పేదలకు మేలు

మోదీ పాలనలో దేశాభివృద్ధి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

7



7

గిరిజనుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

రాజకీయాలు మాని పాఠాలు చెప్పండి


ఆదర్శ పాఠశాలలో జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు

- » టెన్త్ ఫలితాలు తగ్గడంపై డీఈవో సీరియస్
- » 'బడిబాట' చేపట్టకపోవడంపై ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం

శంకర్‌పల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు చేస్తూ పిల్లలకు పాఠాలు చెప్పడం మరిచినట్లున్నారు... పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులపై డీఈవో సుశీంద్ర రావు సీరియస్ అయ్యారు. సోమవారం శంకర్ పల్లి ఆదర్శ పాఠశాల, ప్రాథమిక పాఠశాల(బాలుర), బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. టెన్త్‌లో 94 మంది విద్యార్థులకు 47మంది ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపాల్ శోభారాణిపై మండిపడ్డారు. గత సంవత్సరం 94శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇప్పుడు 50 శాతానికి పడిపోవడమేమిటని అసహనం వ్యక్తం చేశారు. జూన్ 6 నుంచి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 45మంది విద్యార్థులు జాయిన్ కావడంపై కోపడ్డారు. 160 సీట్లు భర్తీ చేయాల్సిందేనని ఆదేశించారు. జన్వాడ ఉన్నత పాఠశాలలో ఫలితాలు తగ్గడంపై ఎంఈఓ అక్బర్ పైన సైతం డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీని అభినందించారు. బాలికల ఉన్నత పాఠశాల సమస్యల గురించి జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకొచ్చారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

చేవెళ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ తల్లిపేరు మీద మొక్కలు నాటాలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం తెలిపారు. బీజేపీ పిలుపు మేరకు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కంజర్ల ప్రకాశ్, శ్రీకాంత్, అనంతరెడ్డి, మాల్గారి వైభవ్‌రెడ్డి, ఆంజనేయులు, శర్వలింగం, శ్రీనివాస్, ఇంద్రసేనరెడ్డి ఉన్నారు.

షాబాద్ : బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్‌లతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణెయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, మహేష్ పాల్గొన్నారు.


షాబాద్‌లో మొక్కను నాటుతున్న బీజేపీ నాయకులు


సమావేశంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, అధికారులు

యువత ఆకాంక్షలను నెరవేరుస్తాం

» కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

నందిగామ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యువత ఆకాంక్షలను నెరవేరుస్తూ నైపుణ్యాభివృద్ధి వైపు యువతకు శిక్షణ ఇస్తూ దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఎంతో ఉపయోగపడుతాయని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి అన్నారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతివనంలో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సదరన్ స్టేట్స్ కేంద్రపాలిత ప్రాంతాల స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమావేశానికి కేంద్రమంత్రి హాజరై మాట్లాడారు. రూ.60వేల కోట్లతో దేశవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, 5 ప్రాంతాల్లో స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రతిపాదించిన ఐదు కేంద్రాల్లో మొదటగా హైదరాబాద్, చెన్నైల్లో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లలో రెండు కొత్త ఎక్సలెన్స్ సెంటర్‌లను స్థాపిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఎక్సలెన్స్ కేంద్రాల్లో అభివృద్ధి చెందుతున్న డొమైన్‌లకు అనుగుణంగా ప్రత్యేక నాణ్యత బోధకులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. స్థానిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఐటీఐలకు జవాబుదారీతనం, నాణ్యత పెంపొందించడానికి బలమైన గ్రేడింగ్, అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. కౌశల్ మంథన్ వర్క్‌షాప్ ద్వారా కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంచడంతో పాటు వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేరళ స్కిల్‌డెవలప్‌మెంట్ మంత్రి శివన్ కుట్టి, దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నైపుణ్యాభివృద్ధి ప్రధానకార్యదర్శులు, ఉపాధి మరియు శిక్షణ డైరక్టర్లు, ప్రాంతీయ డైరక్టర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

» సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఆందోళన

మంచాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి లింగంపల్లి గేటు వద్ద ఉన్న ఇళ్ల సముదాయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆందోళనకు స్థానిక బీఆర్ఎస్ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. లింగంపల్లి గేటు వద్ద ఐదేళ్ల క్రితం 98 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. మంచాల, లింగంపల్లి, నోములకు చెందిన లబ్ధిదారులను ఎంపిక చేశారని, కానీ ఇప్పటివరకు కేటాయించలేదన్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు ప్రసాద్‌రావు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వచ్చి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ నెల 23న ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి రావుల జంగయ్య, శ్యాంసుందర్, బుగ్గరాములు, జంగయ్య, బీఆర్ఎస్ నేతలు మహేందర్, పరమేష్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సీసీఐ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



జీతాలు పెంచాలని కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

తాండూరు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తమ రోజువారీ వేతనం పెంచాలని ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించి సీసీఐ కర్మాగారం ఆవరణలో ఆందోళన చేశారు. సోమవారం కరన్ కోట్ సీసీఐ కర్మాగారంలో పనిచేస్తున్న అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హైస్కిల్డ్ కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన చేశారు. పీఎఫ్ కూడా సకాలంలో కట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్‌స్కిల్డ్ వర్కర్లకు రోజుకు రూ.783, సెమీస్కిల్డ్‌కు రూ.868, హైస్కిల్డ్ కార్మికులకు రూ.1,035ల చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వీరికి వరుసగా రూ.450, రూ.510 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. జీతాలు పెంచాలని, గత అక్టోబర్ 5న పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రమిచ్చినా పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోయారు. కార్మికుల పొట్ట కొడుతున్న లేబర్ కాంట్రాక్టర్ కిషన్‌రావు కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర కార్మిక శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామన్నారు.కార్యక్రమంలో కార్మికులు దస్తప్ప, మోహన్, సంజీవ్, నరేష్, ఆనంద్, తాహెర్‌పాషా, సూరి పాల్గొన్నారు.

తేలిక పాటి వర్షానికే రైతు వేదికలోకి నీరు



రైతు వేదికలో నిలిచిన వాన నీరు

మర్పల్లి, జూన్16, (ఆంధ్రజ్యోతి): రూ. 22లక్షలతో కట్టిన రైతు వేదిక చిన్న పాటి వర్షాలకు ఉరుస్తోంది. సిరిపూరం రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు హాజరయ్యారు. లోపలికి వాన నీరు రావడంతో అధికారులు, రైతులు ఇబ్బందిపడ్డారు. మూడేళ్లకే రైతు వేదిక ఉరుస్తోందని వాపోయారు.

రైతన్న సంబురం

- రైతు భరోసా నిధులు విడుదల
- ఖాతాల్లో జమవుతున్న డబ్బు
- తొమ్మిది రోజుల్లో అందరికీ పెట్టుబడి సాయం



గొట్టిముక్కుల రైతు వేదిక నుంచి సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తదితరులు

వికారాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసింది. జిల్లాలోని 20 మండలాల్లో 539 గ్రామాల్లో 3,18,447మంది రైతులకు రూ. 384,39,28,387 పెట్టుబడి సాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించగా సోమవారం వరకు 2,71,524 మంది బ్యాంకుల ఖాతాల వివరాలను వ్యవసాయాధికారులు రూ.357.94 కోట్ల రైతు భరోసా నిధులకు సిఫారసు చేశారు. జిల్లాలో 2,05,637మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమకు రూ.163.74కోట్లను ట్రెజరీకి పంపారు. ఇదిలా ఉంటే సోమవారం రాత్రి వరకు 1,62,596 మంది రైతులకు సుమారు కోటి రూపాయలను ఖాతాల్లో జమచేశారు. తొమ్మిది రోజుల్లో రైతులందరికి రైతు భరోసా జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బొంరాస్‌పేట్ మండలంలో 13,685 మంది రైతులకు, దౌల్తాబాద్‌లో 19,599 మందికి, దుద్యాల్‌లో 11,325 మందికి, కొడంగల్‌లో 17,751మందికి పెట్టుబడి సాయం అందిస్తారు. చౌడాపూర్ మండలంలో 8,994మంది రైతులకు, దోమలో 16,302 మందికి, కులకచర్లలో 12467మంది, పరిగిలో 20,988 మందికి, పూడూరులో 20,164 మంది రైతులకు, బషీరాబాద్ మండలంలో 14,942 మందికి, పెద్దేముల్‌లో 15,578మందికి, తాండూరులో 14,931 మందికి, యాలాల్‌లో 15,134 మంది ఖాతాల్లో డబ్బు జమ చేస్తారు. బంట్వారం మండలంలో 7,886 మంది రైతులకు, ధారూరులో 16,209 మందికి, కోట్‌పల్లిలో 10,127 మందికి, మర్పల్లిలో 22,749 మంది రైతులకు, మోమిన్‌పేట్‌లో 17,671 మందికి, నవాబ్‌పేట్‌లో 20,077 మందికి, వికారాబాద్ మండలంలో 21,868 మంది రైతులకు రైతు భరోసా అందించనున్నారు.

గొట్టిముక్కులలో హాజరైన కలెక్టర్

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులు వీక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. రైతు వేదికల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు హాజరయ్యారు. వికారాబాద్ మండలం, గొట్టిముక్కుల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తదితరులు హాజరై వీక్షించారు.

మేడ్చల్ జిల్లాలో 3,656 మంది రైతులకు...

మేడ్చల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సోమవారం 3,656మంది రైతులకు ప్రభుత్వం వానాకాలం రైతు భరోసాను ఖాతాల్లో జమచేసింది. 3,656 మంది రైతులకు రూ. 17,105,750 నిధులు ప్రభుత్వం జమచేసింది. జిల్లాలో 48 వేల రైతులున్నారు. వారిలో రెండు ఎకరాల్లోపు రైతులకు సోమవారం ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమచేసింది. పంట పెట్టుబడి సాయం కింద గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టి. ఈ పథకం ద్వారా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో వానాకాలం, యాసంగిలో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఈ పథకాన్ని రైతు భరోసాగా కొనసాగిస్తూ ఎకరానికి రూ.6వేల చొప్పున మంజూరు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం 24,900ఎకరాల్లో అధికారులు పంటల సాగు అంచనా వేశారు. జిల్లాలో 49,395 మంది రైతులకు దాదాపు రూ.28కోట్ల రైతు భరోసా డబ్బు అందాల్సి ఉంటుంది. మొదటి రోజు 3,656 మంది రైతు లకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేసింది.

'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని జిల్లా రైతులు మూడుచింతలపల్లి రైతువేదిక ద్వారా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కలెక్టర్ మను చౌదరి, జిల్లాలోని రైతులు, వ్యవసాయాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, హార్టికల్చర్ అధికారి శ్రీధర్, పెద్ద ఎత్తున రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీరంగవరం పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీ రాజేందర్

మేడ్చల్ టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి పలు గ్రామాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సైదోనిగడ్డ తండా, రావల్ కోల్ తండాల్లోని సమస్యలపై స్థానికులు ఆయనకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీకి చెప్పారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు పొలాల్లోకి చేరి వ్యవసాయ పొలాలు మురికి కుంటలుగా మారుతున్నాయని వాపోయారు. మురుగు నీటితో పంటలు వేసుకోలేక పోతున్నామని, వేసిన పంటలను కోసుకోలేక పోతున్నామని రైతులు తెలిపారు. శ్రీరంగవరంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీ సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యలపై ఉపాధ్యాయులు ఎంపీకి వివరించారు. అనంతరం ఎపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడ్డ ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లో సమస్యల్లేకుండా అధికారులు చర్యలు తీసుకునేలా కృషిచేస్తామన్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతీ గ్రామాన్ని పర్యటిస్తామన్నారు. ఎంపీ వెంట బీజేపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, దొడ్ల మల్లికార్జున్, పోచయ్య తదితరులు ఉన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి



చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్' పేరిట మావోయిస్టులపై కొనసాగుతున్న హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. ఈ నెల 17న చేపట్టే చలో ఇందిరాపార్క్ మహాధర్నా పోస్టర్‌ను సోమవారం చేవెళ్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు మక్బుల్, మంజులు, శ్రీకాంత్, లలిత, నర్సింలు, యాదమ్మ, పెంటయ్య పాల్గొన్నారు.

స్టైపండ్ కోసం మెడికోల నిరసన

● ఆందోళన చేస్తే సర్టిఫికెట్లు ఇవ్వం అని డీన్ బెదిరింపు



మహవీర్ మెడికల్ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న పీజీ మెడికోలు

వికారాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మహవీర్ మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్లు, పోస్టు గ్రాడ్యుయేట్(పీజీ) విద్యార్థులు తమ స్టైపండ్ ఇవ్వాలని సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నాలుగు నెలలుగా స్టైపండ్ ఇవ్వడంలేదన్నారు. జీవో 59, ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం, హౌస్ సర్జన్లకు నెలకు రూ. 25,906, పీజీ విద్యార్థులకు రూ.58,289 చెల్లించాలన్నారు. కానీ నాలుగు నెలలుగా ఇవ్వడం ఆందోళన చేశారు. కాలేజీ డీన్ డాక్టర్ ఐబీ రాజు విద్యార్థులతో మాట్లాడుతూ.. 'పీజీ సీటు ముఖ్యమా? స్టైపండా? అని ప్రశ్నించారని, పరీక్ష రాయాలంటే విధుల్లోకి రావాలని, లేదంటే ఎక్స్‌టెన్షన్లు వేస్తామని, అవసరమైతే సర్టిఫికెట్లు కూడా ఇవ్వం.' అని బెదిరించారని వైద్య విద్యార్థులు తెలిపారు.

రోడ్డులేని స్థలంలోకి వెళ్లేదెలా?

● హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద ఓఆర్ఆర్ నిర్వాసితుల నిరసన



బంజారాహిల్స్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు స్థలాలు కేటాయించి అందులోకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్ కొండాపూర్ వాసులు అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డుకు వివిధ ప్రాంతాలకు చెందిన తాము భూములు కోల్పోయినట్టు చెప్పారు. నిర్వాసితులందరికీ ఘట్‌కేసర్ సమీప కొండాపూర్ శివారు 276 సర్వే నంబర్‌లో కొండ ప్రాంతాన్ని కేటాయించారన్నారు. 100ఎకరాల ప్రభుత్వ భూమి డెవలప్‌మెంట్‌కు 2008లో బొల్లినేని సీనయ్య అండ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారన్నారు. సీనయ్య కంపెనీ సద్గంగా డెవలపర్స్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చిందన్నారు. అయితే తూతూ మంత్రంగా పనులు చేసి ప్లాట్లకు రాళ్లు పాతి వదిలేశారని తెలిపారు. ప్లాట్లకు వెళ్లేందుకు రోడ్లు వేయలేదని, హెచ్ఎండీఏ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని ప్లాట్ల ఓనర్లు డిమాండ్ చేశారు.

కబ్జా చెర వీడిన క్రీడా ప్రాంగణం



తొలుకట్ట క్రీడా ప్రాంగణం స్థలంలో వేసిన కడీలు

మొయినాబాద్ రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడామైదనాల స్థలాన్ని కాజేసుందుకు కొందరు యత్నిస్తున్నారు. మండలంలోని తొలుకట్టలో గల సర్వే నంబర్ 134లో క్రీడామైదానం పక్కన నగరానికి చెందిన వ్యక్తికి కొంత జాగా ఉంది. అయితే తన స్థలాన్నిదాటి క్రీడా ప్రాంగణం స్థలం కబ్జాకు యత్నించాడు. జాగాకు ఏకంగా సిమెంట్ గోడలను నిర్మించాడు. దీనిపై సమాచారం అందుకున్న తొలుకట్ట మాజీ ఎంపీటీసీ రవీందర్‌యాదవ్ గ్రామస్తులతో కలిసి రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చి అక్రమలను తొలగించారు. నగరం నుంచి వచ్చి కొందరు ఇక్కడి స్థలాలను కబ్జా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు.

దాతర్ చెరువు కాలువ సర్వే



దాతర్ చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

ఆదిభట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర కలాన్ దాతర్ చెరువు కాలువను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. చెరువు కాల్వను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి పాత కాల్వను పూడ్చి, కొత్త కాల్వను నిర్మిస్తున్నాడని కొంగరకలాన్ రైతులు మే 26న అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం సర్వే నిర్వహించారు. డీఈఈ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. కొంగరకలాన్ రైతుల ఫిర్యాదుతో రెండు దఫాలు క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. కాలువ పనులకు ఇరిగేషన్ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కాలువను ఆక్రమించారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. కాలువ పొడవు, వెడల్పు తెలియాలంటే రెవెన్యూ మ్యాప్ చూసి ఏ సర్వే నంబర్‌లో ఎంత మేర ప్రవహిస్తోందో గుర్తించి సర్వే చేశామని, సర్వే రిపోర్ట్ రాగానే హద్దురాళ్లు గుర్తిస్తామన్నారు. సర్వే రిపోర్ట్‌వస్తే కాల్వ పరిధి తెలుస్తుందన్నారు. రెండు, మూడు రోజుల్లో రిపోర్ట్ వస్తుందని, హద్దురాళ్లు పాతిస్తామని చెప్పారు. సర్వేయర్ సాయికృష్ణరెడ్డి, ఏఈ హరిత, ఫీల్డాఫీసర్ సాయికుమార్, రైతుల పాల్గొన్నారు.

ఊపందుకున్న సాగు పనులు

పత్తివైపు రైతుల మొగ్గు

పొలం పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు కూలీలు

పెరిగిన కూలి రేట్లు, ట్రాక్టర్ల అద్దె

యాలాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అడపాదడప కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వారం రోజులుగా విత్తనాలు విత్తుకుంటున్నారు. యాలాల ప్రాంతంలో గతంలో కంది పంట సాగుచేయగా, రెండుమూడేళ్లుగా 80శాతం పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. రాస్నం, పగిడ్యాల్, ముద్దాయిపేట్, కమాల్‌పూర్, కోకట్, రామవాపూర్, దేవనూరు, యాలాల, సంగెంఖుర్దు, హాజీపూర్, అగ్గనూరులలో వారం రోజుల నుంచి సాగు పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

పెరిగిన దుక్కుకం ఖర్చులు

ట్రాక్టర్లు, అద్దె నాగండ్ల రేట్లు పెంచేశారు. గత సంవత్సరం గంటకు ట్రాక్టర్ అద్దె రూ.వెయ్యి ఉండగా, ఈ సారి రూ.1200 తీసుకుంటున్నారు. అలాగే నాగండ్లు, గుంటకుల రేట్లు కూడా పెంచారని రైతులు వాపోతున్నారు. కూలి ధరలు సైతం పెరిగాయి. గతేడాది రోజు కూలి రూ.300 ఉండగా, ఇప్పుడు రూ.350 నుంచి రూ.400కు పెంచారని చెబుతున్నారు. అన్ని ధరలూ పెరుగుతున్నా తాము పండించే పంటలకు మాత్రం గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పల్లెల్లో సందడి!

(ఐదో పేజీ తరువాయి)

పేర్లను ఆయా పార్టీలు పరిశీలిస్తున్నాయి. గతంలో జెడ్పీటీసీలుగా పనిచేసిన వారు మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్లు కలిసి రాకుంటే తమ అనుకూలులను బరిలో దించేయత్నం చేస్తున్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ అమల్లో ఉన్నందున తమ పరిధిలోని స్థానం మహిళలకు రిజర్వుడైతే తమ కుటుంబంలో లేడీస్‌ని రంగంలో దింపాలని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ కూడా అధికారులు పూర్తి చేశారు. ఇటీవల కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు కావడంతో గ్రామ పంచాయతీల సంఖ్య గణనీయంగా తగ్గింది. హైదరాబాద్ నగర శివార్లలోని అనేక గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో మేడ్చల్ జిల్లాల్లో అన్ని గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. మేడ్చల్ జిల్లాలో ఒక్క గ్రామ పంచాయతీ కూడా ఇపుడు లేకపోవడంతో ఇక్కడ జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలు జరగడం లేదు. ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ వ్యూహరచన చేస్తున్నాయి.



అధికారులు సన్నద్ధం

స్థానిక ఎన్నికలకు అధికారయంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. ఇప్పటికే అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తి చేశారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ ఇంతకు ముందే పూర్తి చేశారు. ఎన్నికల సిబ్బందితో కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. అలాగే పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు బ్యాలెట్ బాక్సులు కూడా అధికారులు సిద్ధం చేశారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వీటికి అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు రెడీ చేశారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బంది నియామకాలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికలకు గుర్తులు కూడా ఖరారు చేశారు. సర్పంచి స్థానాలకు సంబంధించి 30 గుర్తులు ఖరారు చేయగా, వార్డు సభ్యులకు 20 గుర్తులు ఖరారు చేశారు. సర్పంచ్ పోలింగ్‌కు పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రం సిద్ధం చేస్తున్నారు. బ్యాలెట్ ముద్రణకు జిల్లా స్థాయిలో టెండర్లు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఎన్నికలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల కోసం మరికొన్ని గుర్తులు సిద్ధం చేస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎన్ని విడతలుగా నిర్వహిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

అధికార పార్టీకి సవాల్

స్థానిక ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా క్షేత్రస్థాయిలో ఇంకా ఆ పార్టీ పూర్తిస్థాయిలో బలపడలేదు. దీంతో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. గ్రామాలు, పురపాలికల్లో పట్టుపెంచుకునేందుకు అధికార పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఇటీవల మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ ఎన్నికల్లో నూటికి నూరుశాతం గెలవాలని, ఈ బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నేతలు తీసుకోవాలని చెప్పారు. అయితే ఇంత వరకు పార్టీ ఈ మేర బలపడలేదు. క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నేతల మధ్య సఖ్యత లేదు. ఎవరికీ వారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం అంతంత మాత్రంగానే ఉంది. ముఖ్యంగా నగర శివార్లలో అధికార పార్టీ ఇప్పటికీ గట్టిపట్టు సాధించలేదు. పార్టీ కార్యక్రమాలు కూడా తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో పూర్తిస్థాయిలో స్థానాలు సాధించింది. తరువాత అధికారంలో ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో అంతగా బలం చూపలేకపోయింది. అయితే ఇపుడు పూర్వవైభం కోసం కాంగ్రెస్ చమటోడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కొన్ని ప్రాంతాల్లో బలంగా ఉన్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు మంచి కేడర్ ఉంది. అధికార పార్టీ వైఫల్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాయి.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రతీ ఒక్కరు యోగా చేయాలి

యాచారం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు నిత్యం యోగా సాధన చేయాలని, యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటామని మండల వైద్యురాలు ప్రియాంక తెలిపారు. సోమవారం యాచారంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా గొప్పతనాన్ని తెలియజెప్పారు. 21న సామూహిక యోగా కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపర్చాలన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు పోరాటం ఉధృతం చేశారు. నిరసనలు కొనసాగిస్తున్నారు. మండలంలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 231వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా నిరసన ర్యాలీలు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. 11 పంచాయతీలతో మండల కేంద్రం చేయాలని కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న కల్యాణ్‌నాయక్

కడ్తాల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి రానున్న స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, పార్టీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్‌లు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మైసిగండిలో సోమవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహం, మోదీ సర్కార్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. 18నెలలైనా ఆరు గ్యారంటీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. పేదల నుంచి వందలాది దరఖాస్తులు స్వీకరించి పదుల సంఖ్యలో మంజూరు చేస్తున్న ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు, అనర్హులకే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అనేక సంక్షేమ పథకాలు కేంద్రం సహకారంతో కొనసాగుతున్నాయని నేతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు రెడ్యానాయక్, భగీరథ, రాందాస్, మన్య, శంకర్‌నాయక్, వెంకటేశ్, విక్రాంత్, శ్రీశైలం, శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



గిరిజన భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శంకర్‌కొండ తండాలో ఐటీడీఏ ద్వారా రూ.60లక్షలతో నిర్మించే గిరిజన భవన్‌కు సోమవారం అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రూ.12,600కోట్లతో ఇందిర సౌరగిరి జల వికాస పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీంతో ఎస్టీ రైతుల భూముల్లో బోర్లు వేయించి సౌర విద్యుత్ పంపుసెట్లను ఉచితంగా అందజేస్తోందన్నారు. లక్ష మంది గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు రూ.1,360కోట్లు కేటాయించారని వెల్లడించారు. అన్ని తండాలు, చెంచు గూడాలకు బీటీ రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వేల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.బాలు, డీఈఈ నిత్యానందం, ఏఈ నిత్యానందస్వామి, ఎంపీడీవో మాధురి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, నాయకులు దాదెడ్డి అంజన్‌రెడ్డి, కృష్ణనాయక్, పత్యనాయక్, వెంకట్‌రెడ్డి, పర్వతాలు, బాబ, విజయ్, నరేశ్, విజయ్‌రాథోడ్, ఫరీద్, మల్లయ్య, శ్రీశైలం, రవీందర్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యతోనే భవిత



అక్షరాభ్యాస కార్యక్రమంలో బీఎస్.ఆంజనేయులు, భీమ్‌రెడ్డి

కులకచర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బాల్యంలో విద్య అభ్యసించడం ద్వారా భవితకు వెలుగునిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

నేడు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం



ఇబ్రహీంపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షం లభించనుంది. 'నిర్మించి మూడేళ్లు.. మోక్షమెప్పుడో?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. రూ.1.2కోట్లతో 17మడిగెలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. నాగార్జునసాగర్ రహదారి పక్కన ఉన్న ఈ మడిగెలకు డిమాండ్ ఉంది. కాగా నేటి(మంగళవారం) సాయంత్రం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని ఏఎంసీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మరో 15రోజుల్లో మడిగెల కేటాయింపునకు వేలం నిర్వహిస్తామని తెలిపారు.



స్నేహ మహిళా బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మహిళా బ్యాంకును పంచాయతీకి తరలించాలి

కీసర రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్నేహ మహిళా బ్యాంకును కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి తరలించాలని మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. మహిళా బ్యాంకు ప్రస్తుత భవనాన్ని నవోదయ స్కూల్‌కు కేటాయించారు. మహిళా బ్యాంకును కీసర పంచాయతీ ఆఫీసులో కొనసాగించాలని కొందరు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలోని భవనంలో నిర్వహించాలని మరికొందరు సూచించారు. అందుకు కలెక్టర్ అనుమతి పొందారు. దీంతో కొందరు ఆందోళనకు దిగారు. పీహెచ్‌సీలో బ్యాంక్‌తో రోగులకు ఇబ్బంది కలుగుతుందని, కీసర పంచాయతీ కార్యాలయానికి తరలిస్తే సమస్యలుండవని వాదిస్తున్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి



శ్రీనునాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. ప్రగతి నిరోధక విపక్షాలకు గుణపాఠం తప్పదన్నారు. మండలంలో సోమవారం శ్రీనునాయక్ పర్యటించి శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయ కల్పిస్తూ పాలన చేస్తోందన్నారు. తండాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, నాయకులు బొల్ల యాదగిరి, నరేశ్, శ్రీను, దేవేందర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'నవోదయ' పనులు

కీసర రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నవోదయ పాఠశాల ఏర్పాటుకు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మేడ్చల్ జిల్లాకు మంజూరైన కేంద్ర ప్రభుత్వ నవోదయ పాఠశాలను దమ్మాయిగుడ మున్సిపాలిటీ కీసర టౌన్‌లోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయ పాత భవనంలో ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆరో తరగతిలో ప్రవేశంపొందిన బాలబాలికలు మొత్తం 80 మంది ఇక్కడ చదువుతారు. పాత ఎంపీడీవో కార్యాలయంలో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పక్కనే ఉన్న స్నేహ మహిళా బ్యాంకు భవనంలో బాలికల హాస్టల్, పాత బీసీ బాలికల హాస్టల్ భవనంలో బాలుర హాస్టల్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా భవనాలకు చిన్నచిన్న మరమ్మతులు వేసి రంగులు వేశారు. కాగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యంనంపేట్‌లో నవోదయ శాశ్వత భవన నిర్మాణానికి 25ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అక్కడ నిర్మాణాలు పూర్తయ్యేంత ఇక్కడ పాఠశాలను కొనసాగిస్తారు.



భవనానికి వేసిన రంగులు



తుక్కుగూడ మున్సిపాలిటీలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

మహేశ్వరం, జూన్16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో వ్యాపారులు, హోటళ్ల యజమానులు, ప్రజలు భాగస్వాములు కావాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం మున్సిపల్ వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రోడ్లపై చెత్త వేసిన పలువురిని గుర్తించి జరిమానా విధించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త సేకరణలో ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుదామన్నారు. బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేంద్ర పథకాలతో పేదలకు మేలు

కందుకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదలకు మేలు చేకూరుతోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకులు అర్జున్‌రెడ్డి, శ్రీరాముల యాదవ్, జంగయ్యలతో కలిసి నర్సింహారెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం రక్షణ రంగంలో ఎంతో పురోగతి సాధించిందన్నారు. ప్రపంచ స్థాయి దేశ రక్షణ వ్యవస్థను బీజేపీ పాలనలో ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే ప్రజా సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఉజ్వల ఎల్పీజీ గ్యాస్, ఉచిత రేషన్, శ్మశాన వాటికల ఏర్పాటు, ఎమెన్యూ ప్లాంటేషన్, కిసాన్ సమ్మాన్ యోజన, ఫసల్ బీమా వంటి పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, సాధ మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, ఎన్.నర్సింహారెడ్డి, భిక్షపతి, బాబురావు, మల్లేష్, పాండు, కృష్ణారెడ్డి, పర్వతాలు, భూమిరెడ్డి, రఘునందన్, అనిల్, నరేందర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు

కీసర రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీనివాస్‌నగర్ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన శకుస్థాపన చేసారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రవీన్, స్థానికులు పాల్గొన్నారు.



నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్

శామీర్‌పేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నూతన కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, కొందరు మండల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ బిక్షపతి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, జి.రమేష్, యాదగిరి, భానుచందర్ పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్

పౌష్టికాహారంతో టీబీ నియంత్రణ

కులకచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటే టీబీ వ్యాధిని నియంత్రించొచ్చని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిలో టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. టీబీ బారిన పడిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స చేయించుకుంటే తగ్గుతుందన్నారు. రోగులు బలవర్థక ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది స్వరూపరాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టీబీ హెల్త్ విజిటర్ రాజునాయక్, వెంకటయ్య, సుజాత, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు

తాండూరు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి వస్తున్న తమను కొందరు కులం పేరుతో దూషించారని బాధితులు ఫిర్యాదు చేశారని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెనిగేష్‌పూర్‌నకు చెందిన బస్వరాజ్, లక్ష్మి ఆదివారం పొలం పనులకు వెళ్లి వస్తుండగా.. గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నానీగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్‌లు.. ఎరుకలి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారన్నారు. అలాగే దాడిచేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ చెప్పారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, దూషించిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాగా చెనిగేష్‌పూర్‌లో ఎరుకుల వారిపై దాడి చేసిన వారిని శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

నేటి సమాచారం

ఎమ్మెల్యే రంగారెడ్డి పర్యటన

మంచాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం మంచాల మండల పరిదిలో పర్యటించనున్నారు. చెన్నారెడ్డిగూడలో రూ.41లక్షలు, ఆరుట్లలో రూ.97.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. మంచాల శర్వంజీ గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో 435 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 53 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చౌదరిగూడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల, చెగిరెడ్డిఘణాపూర్, జిల్లేడ్, మొట్టు గడ్డతండా, వేపకుచ్చ తండాలో మంగళవారం సరఫరాలలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భాషా పేర్కొన్నారు. శంషాబాద్ బస్టాండ్, ఆర్‌జీఐ పీఎస్, నక్షత్ర విల్లాస్, సిద్ధాంతి, మల్లికా గార్డెన్, సంపత్ నగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఆర్‌బీ నగర్, అయ్యప్ప టెంపుల్, హుడా కాలనీ, మిషన్ కాంపౌండ్, ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

భూ భారతి సదస్సులు

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఖాల్సా రెవెన్యూకు సంబంధించి భూ భారతి సదస్సు మంగళవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సునీతారెడ్డి తెలిపారు. చెర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, ఉప్పరిగూడ గ్రామ పంచాయతీలతోపాటు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖాల్సా రెవెన్యూలో భూ సమస్యలున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆమనగల్లులో వైద్య శిబిరం

ఆమనగల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు. మున్సిపాలిటీ వంద రోజుల అభివృద్ధి ప్రణాళికలలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

నోట్ బుక్కులు పంపిణీ

చౌదరిగూడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం గురుజాపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో గురజాపు ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్, ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం సునిత, ఉపాధ్యాయులు రాములు, పవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను తొలగించడం సరికాదు

మొయినాబాద్ రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పుస్తకాల్లో తెలంగాణ ఉద్యమ చరిత్రను తొలగించడం బాధాకరమని బీఆర్ఎస్ మండల యూత్ విభాగ నాయకుడు వడ్ల కాళిదాస్ చారి ఆవేదన వ్యక్తం చేశారు. అవమానాలు, అనచివేతకు గురై ఎన్నో ఉద్యమాలు చేసి సాధించికున్న తెలంగాణ చరిత్రను వచ్చే తరానికి తెలియజేయడం మన బాధ్యత అని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో నుంచి తొలగించడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శంషాబాద్‌లో రక్తదాన శిబిరం

శంషాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆల్ ఇండియా మర్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్వాడి యువమంచ్ సభ్యులు, సోహన్, దిలీప్‌చౌదరి, రామ్‌అవతార్, శర్మాజీ, రాజు, ప్రేం, రాధిక, సోలంకి, హరిరాం, రమేష్, శ్రవణ్ పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: ర్యాలీలో తహసీల్దార్ సురేందర్



షాద్‌నగర్ రూరల్: సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు



కేశంపేట: రైతు నేస్తంలో రైతులు, అధికారులు

రైతు నేస్తానికి విశేష స్పందన

ఉత్సాహంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో ప్రసంగాన్ని వీక్షించిన రైతులు, అధికారులు

సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులతో కలిసి రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు వివరించారు. రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేతల సూచనలు ఇవ్వడానికి రైతు నేస్తం కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆమనగల్లు నుంచి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు వేదికల వద్ద సందడి నెలకొంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 16



మాడ్గులలో రైతు నేస్తాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కందుకూరు: సీఎం ప్రసంగం వింటున్న రైతులు



షాబాద్: మాచన్‌పల్లి రైతు వేదికలో..



ఆమనగల్లు: తలకొండపల్లిలో..

మృత్యు సాగరంగా పెద్ద చెరువు

(ఐదో పేజీ తరువాయి)

కంప చెట్లు పెద్దఎత్తున ఉండటంతో మృతదేహాలను బయటకు తీయడం కష్టతరంగా మారుతుంది. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తే తప్ప మృతదేహాలను వెలికితీసే పరిస్థితిలేదు. చెరువు నీటి సామర్థ్యం 816 ఘనపుటడుగులు (సుమారు ఒకటిన్నర టీఎంసీలు) కాగా, 42 అడుగుల లోతు ఉంటుంది. ప్రస్తుతం చెరువులో 19 అడుగుల మేర నీటి నిల్వ ఉంది.

చెరువు నిండా కంప చెట్లే..

ఇబ్రహీంపట్నం చెరువు నిండా ముళ్ల కంప చెట్లే ఉన్నాయి. మూడేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషనర్‌రెడ్డి చొరవచూపి ఉపాధి హామీ పథకం కింద కంప చెట్లు తొలగించే పనులు చేపట్టినా వెంటనే వానలు కురవడంతో పనులు ముందుకు సాగలేదు.

పర్యాటకంగా తీర్చిదిద్దాలని

హెచ్ఎండీఏ నిధులు రూ.18 కోట్లతో ఈ చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దాలని బీఆర్ఎస్ హయాంలో ప్లాన్ రూపొందించారు. చెరువు కట్టకు ఉన్న ముళ్ల పొదలు తొలగించడంతోపాటు బోటింగ్ సౌకర్యం, రెస్టారెంట్, పార్కు అభివృద్ధి, లైటింగ్ లాంటివి చేపట్టాలని నిర్ణయించి మొదటి విడతగా ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోయాయి. తిరిగి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాల్సిన అవసరముంది.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- 2023 ఏప్రిల్ 18న భువనగిరి-యాదాద్రి జిల్లా గట్టుప్పలపల్లి మండలానికి చెందిన కుండె కృష్ణ బెట్టింగులకు పాల్పడి అప్పులపాలై చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2023 ఆగస్టు 14న నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం యాత్మకావూరు గ్రామానికి చెందిన ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి (19) అనే బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి అన్‌లైన్ లోన్‌యాప్ కారణంగా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2024 ఫిబ్రవరి 17న ఉప్పరిగూడలో సోదరుడి దశదిన్న కర్మ చేసి స్నానానికని చెరువులో దిగిన నరాల మహేందర్(46) కంప చెట్లలో ఇరుక్కునిమృతి చెందాడు.
- 2024 సెప్టెంబరు 5న నగరంలోని వనస్థలిపురం ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కూతురు, కుమారుడు చెరువులో నీట మునిగి మృతి చెందారు. కుటుంబ కలహాలతో ఒరుసు మంగ అనే మహిళ కూతరు లావణ్య, కుమారుడు శరత్‌లను నీళ్లల్లో తోసి తాను ఆతహ్మత్యకు పాల్పడింది.
- 2025 జూన్ ఒకటిన నగరంలోని ఫలక్‌నూమాకు చెందిన రేష్మ (25) అనే యువతి ఈత కొట్టడానికని చెరువులో దూకి మృత్యువాతపడింది.

సుందరీకరణతో ప్రమాదాలకు చెక్



చెరువు సుందరీకరణ పనులను హెచ్ఎండీఏ చేపట్టింది. దీనికిగాను నీటి పారుదల శాఖ క్లియరెన్స్ కూడా ఇచ్చింది. చెరువు సుందరీకరణతోపాటు చెరువు కట్ట పొడవునా ప్రమాదాల నివారణకు క్రాష్ బ్యారియర్స్, లైటింగ్, స్పీడ్ బేకర్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు. పనులు చేపడితే ప్రమాదాలు తగ్గుతాయి.

- చెన్నకేశవరెడ్డి, డిప్యూటీ ఈఈ, నీటిపారుదల శాఖ



ఎంపీ డీకే అరుణతో బీజేపీ నాయకులు

చౌదరిగూడ అభివృద్ధికి సహకరించాలి

చౌదరిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల అభివృద్ధికి సహకరించాలని బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి విన్నవించారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులలోని శ్రీ సంజీవపురం వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కొల్లూరు వరకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, కొందుర్గు మండల కేంద్రంలోని పీడబ్ల్యూ రోడ్డు నుంచి గంగన్నగూడ, చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్ నుంచి తంగెళ్లపల్లి వరకు ఉన్న రెండు బ్రిడ్జిలతో డబుల్ రోడ్డు, చెర్కుపల్లిలో సర్వశిక్ష అభియాన్‌లో 300 మీటర్ల ప్రహరీ, గంగన్నగూడలో ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాళ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుడు, చైర్మన్ రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, యాదయ్య, సత్యనారాయణరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే చిల్లరగాడంటారా?

కేశంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి ప్రజాసేవకు రాజకీయాల్లోకి వచ్చి మా అమ్మ సర్పంచ్‌గా ఉంటే వెన్నంటి ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ నాయకులు నన్ను చిల్లరగాడు అంటూ విమర్శించడం సరైంది కాదని బీఆర్ఎస్ నాయకుడు పోచమోని రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చింతకుంటపల్లిలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 98లో మూడెకరాల ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఓ నాయకుడు కడీలు పాతితే అధికారులు ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించి కడీలను తొలిగించారని తెలిపారు. అయితే నచ్చక కొందరు కాంగ్రెస్ నాయకులతో కలిసి వ్యక్తిగతంగా టార్గెట్ చేసి తిట్టించారని వాపోయారు. చెరువును అభివృద్ధి చేద్దామంటే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకున్నారని తెలిపారు. సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటయ్య, మల్లేష్, శ్రీనివాస్, శ్రీశైలం, మహేందర్, కాశిమ్ అలీ, రమేష్, రాజేందర్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

చౌదరిగూడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో అర్హులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సురేందర్, మౌలాన్, తాజొద్దీన్, రమేష్ పాల్గొన్నారు.



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

ఎట్టకేలకు విద్యుత్ లైన్ తొలగింపు

కేశంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఇళ్లపై నంచి ఉన్న 11కేవీఏ విద్యుత్ లైన్‌ను అధికారులు తొలిగించారు. గ్రామంలో ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ ఉండడంతో కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ లైన్ తొలిగించాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రామానికి వచ్చిన ట్రాన్స్ కో అధికారులు ఇళ్లపై విద్యుత్ లైన్‌ను తొలిగించారు. దీంతో మాజీ జడ్పీటీసీ, గ్రామస్థులు చేవెళ్ల నరసింహులు, అబ్బి సుందరయ్య, శేఖర్, దేవేందర్, లక్ష్మీనారాయణ, శివయ్య ఎమ్మెల్యేకు కృతజ్ఞలు తెలిపారు.



హర్షం వ్యక్తం చేస్తున్న శ్రవణ్ రెడ్డి

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు

మంచాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్ల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ధ్వజస్తంభానికి సోమవారం ఇత్తడి తొడుగులను బిగించారు. కొంగరకలాన్ గ్రామానికి చెందిన ఉడుతల పుణ్యవతి, నర్సింహగౌడ్ దంపతులు ఈ ఇత్తడి తొడుగులను బహూకరించారు. వారిని మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాండాల జంగయ్య, మొద్దు సికిందర్‌రెడ్డి, మాడ్గుల కృష్ణ, సుంకరి శ్రీనివాస్, సుంకరిపాండరి, గుడ్డిమల్ల చంద్రయ్య, దండు మధుసూదన్‌రెడ్డి, సుంకరి నర్సింహగౌడ్, గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్ జనార్దన్‌రెడ్డి, మానుపాటి వెంకటేష్, కావలి బుగ్గరాములు, వనపల్లి మధు, కావలి శ్రీనివాస్, బోయిని నర్సింహ, యశ్వంత్‌గౌడ్, మార యాదయ్య, దర్శన్, రాజయ్యగౌడ్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ఆమనగల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ లలిత పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంగమ్మనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: భూ భారతి చట్టంతో రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన నిర్వహించిన రైతు సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై ఫిర్యాదులు స్వీకరిరచారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

కేశంపేట: రెవెన్యూ సదస్సులతో రైతులతో మేలు చేసుకురుతుందని కేశంపేట డీటీ గీత అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డి, అల్వాల గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అల్వాలలో 6, కొండారెడ్డిపల్లిలో 20 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాలలో ఆర్ఐ నివేదిత, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కేశంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నాయకులు సురేష్ రెడ్డి, గిరిధర్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నరసింహ, శ్రీను, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి



శివరాజుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జీవిత కాలంలో చేసిన మంచి పనులతో మరణానంతరం కూడా కీర్తించబడుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కడ్తాల మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉద్యోగి, కురుమ సంఘం జిల్లా నాయకుడు కడారి శివరాజు సంస్మరణ కార్యక్రమం సోమవారం కడ్తాలలో నిర్వహించారు. కార్యక్రమానికి మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథనాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలిసి హాజరయ్యారు. శివరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, రమేష్, హర్షవర్ధన్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీహరికి ఎమ్మెల్యే అభినందనలు



మంత్రి వాకిటి శ్రీహరితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వాకిటి శ్రీహరిని కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగం, గ్రామీణ ప్రాంత పరిస్థితులు తెలిసిన వ్యక్తిగా ఆ శాఖకు పూర్తి న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒకరి నేత్ర దానం.. ఇద్దరికి దృష్టి భాగ్యం

ఆమనగల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మంజులాదేవి, ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, ఏపీఎంఓ చంద్రశేఖర్, గోపాల్ రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య, కార్యదర్శి గంప శ్రీను, పీఆర్‌వో పాష, ఉపాధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి కొరివి వెంకటయ్య, కర్నాటి కొండల్ రెడ్డి, సుదీర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆమనగల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేందలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు దారెడ్డి అంజన్‌రెడ్డి అన్నారు. దశాబ్దాల పేదల సొంతింటి కల ఇందిరమ్మ పథకంతో సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అభివృద్ధిలో రాజకీయాలకు చోటులేకుండా ప్రజలంతా పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, వెంకటేష్, లాలయ్య, రామ్, కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికిచెందిన మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు రాము, ఆంజనేయులు, కృష్ణయ్య, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కడ్తాల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎవరూ అధ్యా పడవద్దని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. కడ్తాల మండలం గడ్డమీది తండాకు చెందిన జర్పుల దేవా అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బాధిత పరామర్శించారు. ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. నాయకులు జవహర్‌లాల్ నాయక్, బన్సి, పంత్య, కిషన్, తులసీరామ్‌నాయక్ ఉన్నారు.

కుటుంబ నేపథ్యంతో 'నేను.. నా లల్లి'

మొయినాబాద్ రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే సినిమా ప్రజల ముందుకు వస్తున్నట్లు 'నేను.. నా లల్లి' సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్ ఎన్ఎన్ఆర్ చౌదరి అన్నారు. ఇప్పటికే రెండు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తయిందని తెలిపారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లిలో జరుగుతున్న షూటింగ్ సందర్భంగా మాట్లాడారు. చేవెళ్ల, పరిగి, వికారాబాద్ ప్రాంతాల్లో చిత్రికరించామని, అన్ని వర్గాల ప్రజలు తన సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట తస్లీమ్, ఎన్ఎన్ఆర్ చౌదరి, పద్మ జయంతి, హేమ సుందర్, షియాజీ షిండే, శ్రీనివాస్ చారి, మెండం శ్రీధర్, సాంబ శివరావు, నాని పండు కపిల్, రాజా ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

కడ్తాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామంలో సొంత నిధులతో 100 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ముందుకు వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి దశరథ్‌నాయక్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, వార్డు సభ్యులు మహేందర్‌గౌడ్, జనీల్‌కుమార్, యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ

శంషాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలో సోమవారం సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు నర్రాగిరి మాట్లాడుతూ సీపీఐ పేదలకు అన్ని వేళలా అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. పార్టీలో చేరడానికి బస్తీవాసులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అన్నెపు ప్రభు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.